# కరువు కాలం

**అ**ప్పడు చిన్నప్పటినుంచి ఒక రెండెడ్లబండి పెట్టుకొని, సంతలకి తోలి, అక్కడ మిరపకాయలు, ఉల్లిపాయలు, ఎండుచేపలు తెస్తే, భార్య నరిసి వీధిలో బండరాయిమీద దుకాణం పెట్టి అమ్మేది. వాళ్ళిద్దరూ గంజినీళ్ళుతాగి ఒక మడిచెక్క ఆర్జించారు. కూతురికి పట్నపు సంబంధంచేశారు. కొడుకు నారాయుడు ఎదగగానే, పొలంమీద మూడువందలు అప్పుచేసి, జట్కాబండి కొన్నాడు. అప్పడు ఇప్పుడు బాగా ముసిలాడయేడు. ఇప్పుడు బండీ ఎడ్లు లేవు. మడిచెక్క మాత్రం మిగిలింది.

అప్పడు ఇంటికొచ్చి వీధిలో పొగాకు నముల్తూ కూర్చున్నాడు. చీకటిపడుతూంది. నారాయుడు పొద్దున జట్కాబండి పట్నంతోలుకెళ్ళి ఇంకా రాలేదు. నరిసి పొయ్యిలో నిప్పేసి బయటికొచ్చింది.

"ఏటే, ఈడేటింకా పికరేనేదు. పెందలకడ సద్దిగంజి తాగిపోనాడు. దీపాలెట్టే ఏలయింది.

వాడు ఇంటికి రాకపోతే అప్పడికి బెంగ, చీకాకున్నూ.

"ఎటో బేరం తగిలందిగోవోసు" అంటూ నరిసి, బురదయిన కాళ్ళ కడియాలు చీరెకొంగుతో తుడిచింది.

"ఏటో ఎదవకుంక. సిన్నతనంగాదు, సితకతనంగాదు" చిరాగ్గా అన్నాడు.

"ఆడి నెందుకేటి తిడతావు! ఆడేటిసేసినాడు?

"అదుగో నీనుంచే ఆ డొట్టి పోకిరీ అయిపోయినాడు. ఇంక ఆడు న న్నాదుకోనేదేటి?"

"నేక నేక ఒక్కడు పుట్టినా డీ కడుపుకి—"

"సాలూరుకోయే. నీ దొట్టి మూరకత్వం—"

"పోనీ, సిరిపరపాళ్ళ బొట్టి నిస్తామన్నారుగదా— ముడెట్టేరాదా?"

"అదే సూసినాను—తులం బంగార మెడతారట. రెండు తులాలెట్టమన్నాను. ఏదో సూసి ముడెట్టి పొమ్మం టాను ఎదవని—"

"బాగుందినేరా—స త్తిగాలపో డాడు—"

"ఓ పోస్, నీ కే టెరికే? ఆ డేసాలూ-ఆడూ— ఆడి సెరాయి, సొక్కా, వోసనూ్నని! పెందలకా డెలతాడు. మాపిటి కొస్తాడు. మూడు రూపాయలు దొరికాయంటాడు. అరరూపాయి తాగేస్తాడు. పావలా కబ్బులో తినేస్తాడు. అణా బీడీలు కాలిసేస్తాడు. ఈడి బతుక్కి బీడీలు, కబ్బులు, వోసన నూనెలు! ఇంటికి రెండు రూపాయలిస్తే - గడ్డికీ, ఉలవలకే అవుతాంది రూపాయిన్నర. దీని సిగ తరగా-పావలా ఉలవలు ముప్పావలా అయినాయి! ఏం పిరుం! ఇంక పొయ్యిమీడకి గింజ లేటి తేవాల? ఆ అప్పెలా తీరుతాది? రానీ, సెబుతాను. సెప్పినమాట ఇన్నాడా సరే, నేదా పెల్లి సేసేసి, ఏరుపోయి వండుకోమంటాను. పోనీ, నాకు కొడుకు పుట్టే నేదనుకుం టాను—"

ఆ రోజు అప్పడి చిరాకుకి కారణం ఇంట్లో బియ్యం లేవు. ఊళ్లో ఎక్కడా దొరకవు. సన్నాసినాయుడు పెళ్ళాం

మాత్రం రూపాయికి శేరుచొప్పున అమ్ముతోంది. నారాయుడొస్తే పోనీ, అలాగే తెద్దా మనుకున్నాడు. వాడూ లేడు, డబ్బూ లేదు.

బాగా చీకటిపడింది. నారాయుడు 'గరగరమె దివాలీ' అని పాడుకుంటూ జట్కా నిలబెట్టాడు. గుర్రా న్నిప్పి సాలలో కట్టేసి ఊగుతూ, జోగుతూ లోపలికొచ్చి వంట పొయ్యిదగ్గర కూర్చున్నాడు.

"జేగి కూ డెట్టే---" ఎర్రగా చింతనిప్పుల్లా ఉన్న కళ్లు మూతలుపడుతున్నాయి.

"గింజ లేవీ?" నరిసి అప్పుడికి వినబడకుండా అంది. కాని అప్పుడివి పాముచెవులు.

"ఓ రబ్బోయ్. నువ్వు గడింసేసిన డబ్బుకి కూడొకటి! సిగ్గునేని నమిడీకొడకా, ఎల్లినావురా ఈ ఏల దాకా—"

"శేసనుకి బేరం తోలినాను"-నారాయుడు ఇంట్లో పిల్లి, బయట కోతి.

"ఏటి దొరికిం దీ పొద్దు ?"

"రెండు"

"పొద్దంతా తోలినావు"

"న న్నేటి సెయ్యమంటావు? అంతే, పొద్దంతా తోలితే లచ్చరూపాయ లొస్తాయేటి? కోసుడుదూరం ఎత్తే అద్దరూపా యిస్తారు. ఇయాల ఎండంతసేపూ పరిగెట్టింది గొడ్డు. అయితే మాత్రం ఏటి నాబం.

"ఓరె! ఎంత పనికిమాలినోడి వయినావురా" నిస్పృహగా కూర్చున్నాడు.

"నా నేటి సేసినానేస్"

"తేరా ఆ రెండూను. రూపాయి ఉలవలు, రూపాయి గింజలు తెత్తాను" అన్నాది నరిసి.

నారాయుడు జేబులోని రూపాయితీసి ఖంగునపడేశాడు.

"ఓ రూపాయి కరుసయిపోనాది—"

"రూపాయి కరుసే! ఓలమ్మో రూపాయి తాగేసినాడే" నరిసి ముక్కుమీద వేలేసుకుంది.

"ఏరా, రూపా యేటి సేసినావు?" అప్పడు గద్దించాడు.

"కరుసయిపోనాది. అద్దరూపాయి తాగినాను; అద్దరూపాయి మద్దినాళ్ల చినిమా కెల్లేను"

"ఓలమ్మో, ఎంత పోకిరయిపోనాడు" నరిసి నెత్తీ నోరూ కొట్టుకుంది. కళ్ళంట నీళ్లు రాకపోయినా నరిసి ప్రతి దానికీ ఒట్టి కొట్టినే ఏడుస్తుంది.

"పోసీ. కడుపుకి తాగినాడంటే నే నేటంటాను? ఎదవ కుంక కీ ఏసా లేటి?"—అప్పన్న కోపంగా పెదవికరిచాడు. అప్పడి దృష్టిలో తాగడం అవసరం; గొప్పకూడాను. కాఫీ క్లబ్బులు, బీడీలు, సినీమాలుమాత్రం విలాసాలు.

"పోరా నాయింటోంచి పోయి ఏరే ఒండుకో. నువ్వేటి నాకు గంజినీళ్లోసేదేటి? నాకు కొడుకే నేడనుకుంటాను. పో—సీ! సిగ్గులేని జలమ ఎత్తగానే సరా?"

"ఒరే, రూపాయిచ్చినావు, గుర్రాని కేపెట్టడం, గింజ లేటి తేవడం సెప్పు" చేతిలో రూపాయి పట్టుకొని ఆలోచిస్తోంది నరిసి. సాలలో అస్థిపంజరంలావున్న గుఱ్ఱం ఆకలితో సకిలించింది.

నారాయుడు మెల్లిగా లేచి కుక్కిమంచంమీద కుక్కలాగా ముడుచుకొని పడుకున్నాడు.

"ఈ డేటో గట్టెక్కిస్తాడని జెమపడ్డాను - ఏటో నా కరమం!" అనుకుంటూ, వీధిలో అడుగులచప్పుడయితే చూదామని వెళ్లేడు అప్పుడు.

"ఎవఁడోరయ్యా ఆవల?"

"నేనుదా, సిన్నోడిని"

"ఏటిరోయ్, బావమరిది! ఎటునుంచేటి—?"

"నకిడాం ఎల్లేను; ఇలా సూసిపోదామని..."

"ఒసేయ్, మీ సిన్నోడొచ్చినాడే"

కోర మీసాలు, తలపాగా, ఎఱ్ఱబనీను, గోచీ, చేతిలో మువ్వలకఱ్ఱ, కిఱ్ఱు జోడూ తయారయాడు అప్పడి బావమరది చిన్నోడు. వాడి నందరూ పలకరించారు. కాని అందరికీ చింతగానే వుంది ఇంట్లో బియ్యం లేవని.

"కూకోరా. ఇం కెప్పు డెల్తావు? కూడుతిని తొంగుని కోడికూసేజాముని లేసి ఎల్దుగాని—" అప్పడు ఇంట్లో బియ్యం లేకపోయినా చుట్టాన్ని ఉండమని, బావమరిది దగ్గర తన దర్జా చూపించాడు. బావమరిది కాళ్ళు కడుక్కొని గోడకి జారపడి చుట్ట వెలిగించాడు.

నరిసిగుండెల్లో రాయిపడింది. వీధిలో చుట్టం—ఇంట్లో బియ్యంలేవు—చేతిలోఉన్నది రూపాయి—ఇం కెక్కడా అప్పు దొరకదు. అప్పడిని సైగచేసి పిలిచింది.

"గింజలు నేవు—"

"ఆ రూపాయెట్టి తే—"

"గుర్రానికి ఉలవలో——?"

"మరేటి సేస్తం——గడ్డి పడే——" సాలలో గుర్రం ఆక లితో సకలించింది.

నరిసి పెరట్లోంచి వెళ్ళి సన్నాసి నాయుడు పెళ్ళాం దగ్గర నుంచి రూపాయి బియ్యం తెచ్చి వండింది. సేరుబియ్యం ముగ్గు రికి సరిపోయాయి. పొద్దుటి అంబలి మిగులుంటే తాగి పడు కుంది నరిసి.

అప్పుడూ, బావమరదీ వీధిలో పడుకుని చుట్టలు కాలు స్తున్నారు. ఆ గాఢ చీకట్లో ఆ చుట్టలు నిప్పుకణాల్లా వెలుగు తున్నాయి.

"మీ ఊళ్ళో కరువెలాగుందేస్"అన్నాడు బావమరిది.

"గోరమేన్రా! పెపంచం బగ్గున మండిపోతంది-రూపా యికి శేరు——"

"ఈ వూళ్లో మోతుబర్లే నేరు. మీకు మరీ సికాకు—"

"ఏదో బగమంతుడి దయవల్ల మా కంత నేదులే——" అప్పడు దర్జాగా అని తుప్పున ఉమ్మి, అటునుం చిటు వొత్తి గిల్లి నిశ్చింతగా పడుకున్నాడు.

ఎదురుగుండా చీకటిలో మర్రిచెట్టుమీద గుడ్లగూబ కూసింది.

సాలలో అస్థిపంజరంలా ఉన్న గుర్రం ఆకలిగా సకలించింది.

రచనాకాలం: అక్టోబరు 1947.

——o——